# పోలిగ్రాఫ్ టెస్టుకు కాంగ్రెస్ నాయకులు

**-సామినేని హత్య కేసులో మరో ముందడుగు**




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన సిపిఎం నేత సామినేని రామారావు హత్య కేసు దర్యాప్తులో పోలీసులు మరో ముందడుగు వేశారు. ఆది నుంచి ఈ హత్య కేసులో స్థానిక కాంగ్రెస్ నాయకుల హస్తముందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సిపిఎం సైతం కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతోనే సుపారీ హత్య జరిగిందని ఆరోపిస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో పాతర్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బొర్రా ప్రసాద్, కాంద్ర పిచ్చయ్య, కంచుమర్తి రామకృష్ణ, మద్దిని నాగేశ్వరరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, గుగ్గిళ్ల రాధాకృష్ణను పోలి గ్రాఫిక్ బ్రెయిన్ మ్యాపింగ్ టెస్టు కోసం బెంగళూరు తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఖమ్మం సిపి సునీల్ దత్, వైరా సిఐ ప్రసాద్ లు బెంగళూరు చేరుకున్నారు.

www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 13 | జనవరి | 2026
పేజీలు : 8

## పెరుగుతున్న నిర్బంధం..
# మారిన దోపిడీ తీరు




**-పురోగమనంలో కమ్యూనిస్టులు**
**-చారిత్రిక మలుపుగా ఖమ్మం సభ**
**-మీడియా సమావేశంలో కూనంనేని**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిజెపి పాలనలో నిర్బంధం పెరుగుతుందని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో ఒక పక్క హతమారుస్తూ మరో పక్క ప్రశ్నించే వారిని అర్బన్ నక్సల్స్ పేరుతో నిర్బంధాలకు గురి చేస్తున్నారని కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. ప్రశ్నించే వారి గొంతు నొక్కడం ద్వారా అధికారాన్ని సుస్థిరం చేసుకోవాలని బిజెపి భావిస్తుందని కూనంనేని తెలిపారు. ఖమ్మంలో జనవరి 18న జరగబోయే సభ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఓ మైలురాయిగా నిలవనుందని ప్రజా ఉద్యమాలకు కీలక మలుపు కానుందని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ వందేళ్ల పోరాట చరిత్ర ఏ పార్టీకి లేదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు కీలక భూమిక

మిగతా 2లో..

# ఉద్యమాలను నడిపించేది కలాలే..



**-కమ్యూనిస్టులు లేరనే వారికి భయమెందుకు..?**
**-నూరేళ్ల అరుణ కేతనం ఆవిష్కరణ సభలో సుద్దాల అశోక్ తేజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పీడన ని ర్బంధాల నుంచి ప్రజా ఉద్యమాలు పుట్టుకొస్తాయని ఆ ఉద్యమాలను నడిపించేది కవుల కలాలేనని ప్రము ఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ తెలిపారు. ప్రజలే ఇతివృత్తం గా నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలను ఆలోచింపజేసేదే సరైన కవిత్వమని ఆయన ఉద్బోధించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం డిపిఆర్‌సి భవనంలో అభ్యుదయ రచయితల సం ఘం, సిపిఐ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది కవులు రచించిన కవితా సంకలనం నూరేళ్ల అరుణ కేతనా న్ని సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఇదే సభలో అభ్యుదయ రచయితల సంఘం (అరసం) బాధ్యులు కోంపెల్లి రామయ్య రచించిన నా గమనం కవితా సంపుటిని సైతం సుద్దాల అశోక్ తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అరసం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కెవిఎల్ అధ్యక్షతన జరిగిన సభలో



సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగా లు వెలకట్టలేనివని ఆ త్యాగాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. కమ్యూనిస్టులంటే సమాజ మార్పును కోరుకునే వారని పీడిత తాడిత ప్రజల పక్షాన, కార్మికుల పక్షాన నిలబడి హక్కుల కోసం పోరాడేవారని ఓట్లు, నోట్ల కోసం కమ్యూనిస్టు పార్టీ పుట్టలేదన్నారు. శ్రీశ్రీ చెప్పినట్లుగా దొంగ ఓట్లు దొంగ నోట్లు ఇచ్చు రాజ్యము రాజ్య మా అని మారిన పరిస్థితుల్లో ఓట్లు, సీట్లతో కమ్యూనిస్టుల బలాన్ని అంచనా వేయలేమన్నారు. వందేళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో అనేక పోరాటాలను చేశారని ఆ పోరాటాల వెనక త్యాగాలు ఉన్నాయని ఆ త్యాగాలకు కూడా

మిగతా 2లో..

# ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరగాలి




**-అవసరం మేరకే యూరియా వినియోగించాలి**
**-భూసారాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత**
**-బేయర్ కంపెనీ డ్రోన్లను ప్రారంభించిన తుమ్మల**

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాగు ఖర్చులను తగ్గించుకుంటూ ఆదాయం పెరిగేలా నూతన పద్ధతులను రైతులు అలవర్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో బేయర్ కంపెనీకి చెందిన వ్యవసాయ డ్రోన్లను అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయ డ్రోన్లు వినియోగించి పురుగు మందులు మోతాదులో మాత్రమే చల్లడం ద్వారా భూసారం పెరుగుతుందని యూరియా వినియోగం తగ్గుతుందని పంటల దిగుబడి పెరుగుతాయన్నారు. కెమికల్స్ ఉన్న ఎరువుల వాడకం అధికం కావడం వల్ల పురుగు మందుల అవసరం ఉంటుందని రైతులు సహజ పద్ధతిలో సాగు చేయడంపై దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. బోగస్ కంపెనీలు, హెచ్‌టి విత్తనాల పేరిట నకిలీ విత్తనాలను రైతులకు అందించడం వల్ల చాలా నష్టపోతున్నారని రైతులు తెలిపారు. వ్యవసాయ డ్రోన్లను వినియోగించడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు శిక్షణ అందించి వారికి సబ్సిడీపై అందించే ఆలోచన ప్రభుత్వం చేస్తుందన్నారు. శాటిలైట్ ద్వారా తెగుళ్లు ఎక్కడ ఉందో గుర్తించి అక్కడ మాత్రమే పురుగు మందు వినియోగించేలా పైలెట్ ప్రాజెక్టు అగ్రివాస్ కంపెనీతో చేపట్టనున్నట్లు తెలిపారు. మన పంట పొలాల ఆరోగ్య పరిస్థితుల గురించి రైతులు తెలుసుకోవాలన్నారు. భూసార పరీక్షలకు సంబంధించి

మిగతా 2లో..


# లౌకికశక్తులతోనే ప్రజాస్వామ్య రాజ్యాంగ, పరిరక్షణ

**-ఉద్యమ స్ఫూర్తితో మరో వందేళ్లు ముందుకు..**
**-సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**




2లో

# పన్నుల వసూళ్లపై పట్టింపేది..?




**-కార్పోరేషన్‌లో వసూళ్ల మాయాజాలం**
**-ఇంటి నెంబర్ కూడా లేకుండానే వ్యాపారాలు**
**-కలెక్టరేట్‌ను తాకిన పైరవీ**

2లో

# పెరుగుతున్న నిర్బంధం.. మారిన దోపిడీ తీరు

(మొదటిపేజీ తరువాయి)

పోషించారని ఆయన తెలిపారు. సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది అమరులయ్యారన్నారు. దేశంలో రైతులు, కార్మికులు, మహిళలు, విద్యార్థి, యువ జనులు, ఉద్యోగులు, ఇప్పటి సాఫ్ట్‌వేర్లు సహా ఎవరికి అన్యాయం జరిగినా వారి పక్షాన ఆలోచించేది, ఆందోళన చేపట్టేది కమ్యూనిస్టులేనన్నారు. దోపిడీ, పీడన విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు పోరాడుతున్నారన్నారు. ఇప్పుడు దోపిడీ తీరు మారిందని ఒకప్పుడు బ్లాక్ కాలర్ నేరాలు ఉంటే ఇప్పుడు వైట్ కాలర్ నేరాలు పెరిగిపోయాయని మనిషిని మనిషిగా నిలబెట్టి సర్వం దోచుకోవడం జరుగుతుందన్నారు. నవీన దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ పోరాడుతుందని కూనంనేని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులకు నిర్బంధాలు కొత్త కాదని ఆవిర్భావం నుంచి నిర్బంధాలను ఎదుర్కొంటుందని ఆయన తెలిపారు. నిర్బంధాలు పెరిగిపోతున్నాయని పాలకులు ఎవరైనా ఒకే వైఖరిని అవలంభిస్తున్నారని హక్కులను హరిస్తూ స్వేచ్ఛను దూరం చేస్తున్నారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టులు పురోగమిస్తున్నారని పెట్టుబడి దారి దేశం అమెరికా నడిబొడ్డున యువత సోషలిజాన్ని కాంక్షిస్తూ ప్రదర్శనలు నిర్వహిస్తుందంటే ప్రపంచ ప్రజల్లో వస్తున్న మార్పును గమనించవచ్చునని ఆయన తెలిపారు. అనేక దేశాలలో కమ్యూనిస్టులు అధికారంలోకి వస్తున్నారని ఇది పురోగమనానికి సూచిక అన్నారు. భారతదేశంలో సైతం కమ్యూనిస్టుల ఐక్యత పురోగమించవచ్చునని సిపిఐ భావిస్తుందని ప్రజలు సైతం కమ్యూనిస్టు పార్టీలు ఏకం కావాలని కోరుకుంటున్నారన్నారు. సీట్లు, ఓట్లలో వెనకబడిన కమ్యూనిస్టులు ఎప్పుడు సంస్థాగతంగా బలహీనపడలేదని కూనంనేని తెలిపారు. ఇప్పటికీ బలమైన ఉద్యమ నిర్మాణాలు చేయగలిగిన సత్తా దమ్ము కమ్యూనిస్టులకు మాత్రమే ఉందన్నారు. పెరుగుతున్న ఆర్థిక అసమానతలు ఆర్థిక అంతరాల నేపథ్యంలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో వందేళ్ల పోరాట చరితను నేటి తరానికి తెలియజేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు ప్రజలను సంసిద్ధులను చేసేందుకు జనవరి 18న ఖమ్మంలో చారిత్రిక సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు సౌహార్ద సందేశాలు ఇచ్చేందుకు దేశ విదేశాల నుంచి ప్రతినిధులు వస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. 20న భారతదేశం వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో ప్రధాన వామపక్షాల నేతలు డి. రాజా, ఎంఎ బేబీ, దీపాంకర్ భట్టాచార్య, మనోజ్ భట్టాచార్య , జి. దేవరాజన్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. సిపిఐ జాతీయ కార్యవర్గ కౌన్సిల్ సమావేశాలు మూడు రోజులు ఖమ్మంలో జరగనున్నాయని తెలిపారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమాలను నడిపించేది కళాలే..

(మొదటిపేజీ తరువాయి)

వందేళ్ల నిం డాయని మరో వేయ్యేళ్లయినా కమ్యూనిస్టుల రాజీలేని పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. త్యాగధనులు అరుదు కావచ్చు కానీ కరువు కాలేదని కమ్యూనిస్టుల రూపంలో త్యాగధనులు ఇంకా సజీవంగా ఉన్నారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టులకు బలమే లేదంటున్న వారు కమ్యూనిస్టులను చూసి ఎందుకు భయపడుతున్నారని, మోడీ, అమిత్‌షాలు ఎందుకు టార్గెట్లు విధించి మరణ శాసనం రాస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ సమాజం కోసం ఏదైనా చేస్తే అది కమ్యూనిస్టులేనని ఆయన తేల్చి చెప్పారు. హృదయాన్ని తాకే సాహిత్యం కావాలని ఆ సాహిత్యం ఆలోచింపజేయాలన్నారు. భావోద్వేగం పొం ది ఇతరులకు భావోద్వేగానికి గురి చేయడం సాహిత్యంతోనే సాధ్యమన్నారు. కవిత్వం సందర్భాను సారంగా ఉండాలని ఆయన తెలిపారు. ప్రజల కోసం రాసిన కవి త్వం చిరస్మరణీయమని వారు ప్రజల హృదయాల్లో నిలిచిపోతారన్నారు. మారిన పరిస్థితులకనుగుణంగా నూ తన పద్ధతుల్లో ప్రజలను చైతన్యపరిచేవిధంగా సాహిత్యం రావాలన్నారు. ప్రజా చైతన్యానికి ప్రధాన ఆయుధం పాటేనని ఆ పాటను పోరాటాన్ని సంయుక్తంగా నడిపిన వారు కమ్యూనిస్టులని అశోక్‌తేజ తెలిపారు.

**పాటకు పదునెక్కువ : కూనంనేని**

ఉపన్యాసాల కంటే పాటకు పదునెక్కువ అని వంద ఉపన్యాసాల కంటే ఓ పాట ప్రజలను ఎక్కువగా ఆలోచింపజేస్తుందని కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించేది కళా రూపాలేనన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలను ప్రజల్లోకి తీసుకుపోయేది పాటేనని సాహిత్యం ప్రజా ఉద్యమాలకు దిక్సూచిగా ఉండాలన్నారు. అనేక మంది అభ్యుదయ కవులు తమ రచనలతో కమ్యూనిజానికి ఒక రూపును, ఊపును ఇచ్చారని కూనంనేని తెలిపారు. అభ్యుదయ భావాలను అణిచే శక్తి ఎవరికి లేదని స్పష్టం చేశారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమం అనేక ఒడుదొడుకులను ఎదుర్కొన్నదని అనేక విజయాలను సాధించిందని ఆయన తెలిపారు. శతాబ్ది ఉత్సవాల ముగింపు ఖమ్మంలో జరుగుతున్న సందర్భంగా కవులు, కళాకారులు, అభ్యుదయవాదులు ఇస్తున్న సహకారం మరువలేనిదన్నారు. నూరేళ్ల అరుణ కేతనం కవితా సంపుటికి కవితలు రాసిన కవులను మెమెంటోలతో సత్కరించారు. ఈ సభలో ఆవిష్కరణ కమిటీ కన్వీనర్ లెనిన్ శ్రీనివాస్ స్వాగతం పలుకగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అరసం బాధ్యులు పల్లెర్ల వీరస్వామి, రాపోలు సుదర్శన్, నిధి, కవులు సాధనాల వెంకట స్వామినాయుడు, రౌతు రవి, మువ్వా శ్రీనివాసరావు, సునంద, కోంపెల్లి రామయ్య, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, సిపిఐ సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు శింగు నర్సింహారావు, సిహెచ్ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# లౌకికశక్తులతోనే ప్రజాస్వామ్య రాజ్యాంగ, పరిరక్షణ

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నానాటికి ఖూనీ అవుతున్న ప్రజాస్వామ్యం, అభాసుపాలవుతున్న రాజ్యాంగ పరిరక్షణ లౌకిక శక్తులతోనే సాధ్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక సిపిఐ కార్యాలయంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశం మువ్వ వెంకటేశ్వరరావు(లడ్డా) అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ అంతరాలు లేని సమ సమాజ స్థాపనే సిపిఐ ధ్యేయమని తెలిపారు. 1925లో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ ఆ దిశగా పయనిస్తూ నూరేళ్లు పూర్తి చేసుకుందని, రానున్న మరో వందేళ్లు కూడా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు. దేశంలో మత చాందస వాదం హెచ్చు మీరుతోందని, కులాలు మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు రేపుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని వినాశనం వైపు నడిపిస్తుందన్నారు. అంతరాలు లేని సమాజం ఏర్పాడాలంటే కేవలం కమ్యూనిస్టులతోనే సాధ్యమని ఇందుకు ప్రతి కమ్యూనిస్టు పాటుపడాలన్నారు. సిపిఐ శత వసంత ఉత్సవాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 18న ఖమ్మం కేంద్రంగా ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసభకు ప్రపంచ దేశాల నుండి ప్రతినిధులు తరలి వస్తున్నారని, జిల్లా నలుమూలల నుండి శత వసంత ఉత్సవ ముగింపుకు తరలిరావాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, కంచర్ల జమలయ్య, సలిగంటి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కమటం వెంకటేశ్వర్లు, ఉప్పుశెట్టి రాహుల్, వీరస్వామి, ఫహీమ్, ఉదయ భాస్కర్, రేసు ఎల్లయ్య, దేవరకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చులు తగ్గి రైతుల ఆదాయం పెరగాలి

(మొదటిపేజీ తరువాయి)



రికార్డులను అప్‌డేట్ చేస్తూ ప్రతి రైతుకు వివరాలు అందించే విధానం త్వరలో ప్రవేశపెడతామన్నారు. రైతులు అధికంగా యూరియా వాడితే పంట పండే శక్తి భూమి కోల్పోతుందని దీనిని రైతులు దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఎరువుల ధరలు క్రమబద్ధీకరణ ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం జరిగిందన్నారు. కాంప్లెక్స్ ధర రూ. 1800, యూరియా ధర రూ. 260 ఉండడంతో అధికంగా యూరియా వాడటం జరుగుతుందన్నారు. రైతులకు వ్యవసాయ సాంకేతిక తను అందించేందుకు కంపెనీలు కృషి చేయాలన్నారు. వరి, పత్తి, మిర్చి సాగులో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగువైపు రైతులు దృష్టి సారించాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా పంటల దిగుబడులు పెరుగుతాయన్నారు. వ్యవసాయ సాగులో యూరియా, పురుగు మందుల వాడకం తగ్గించాలని అదనపు కలెక్టర్ సూచించారు. డ్రోన్ల ద్వారా వ్యవసాయ రంగంలో ఎటువంటి ఉపయోగాలు ఉంటాయనే అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. డ్రోన్ల వినియోగం ద్వారా కూలీల కొరత తగ్గుతుందని ఎంత అవసరమో అంతే యూరియా పొలాల్లో వాడటం వల్ల భూములు సారం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూన్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, చింతగుర్తి సర్పంచ్ తమ్మిని ప్రియాంక, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు, బేయర్ కంపెనీ ప్రతినిధులు జివిఎస్ నాయుడు, శివానంద, అశోక్‌రెడ్డి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల వసూళ్లపై పట్టింపేది..?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కార్పోరేషన్ ఆదాయానికి కార్పోరేషన్‌లో పని చేసే సిబ్బందే గండి కొడుతున్నారు. అనుమతులు లేని దుకాణాలపై చర్యలు తీసుకునేందుకు జంకుతున్నారంటే దీని వెనక ఉన్న మతలబు అర్థం కావడం లేదు. వ్యాపారాలు నిర్వహించే వారు ఇంటి నెంబర్ సహా అన్ని అనుమతులు తీసుకోవాలి. అనుమతులు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దుకాణాన్ని సీజ్ చేయాలి. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఇల్లందు రోడ్డులోని విద్యుత్ కార్యాలయ సమీపంలో ఓ వ్యాపారి ఐరన్ సిండికేట్‌తో ఇతరత్రా వ్యాపారాలను నిర్వహిస్తున్నాడు. సదరు వ్యాపారి తన వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఇంటికి కార్పోరేషన్ కేటాయించిన ఇంటి నెంబర్ లేదు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులే ధృవీకరించారు. దీనితో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా ఆరేండ్లుగా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నా ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. ఈ విషయమై కొందరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా అట్టి విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియకుండా చేయడంలో కార్యాలయంలోనే కాదు ఈ వ్యాపారి పైరవీ కలెక్టరేట్‌ను తాకింది. ఓ ఉన్నతాధికారి సహాయకుడు ఈ వ్యాపారిపై వచ్చిన ఫిర్యాదులను ఆ అధికారి దృష్టికి పోకుండా అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ వ్యాపారి స్థలం, ఇల్లు లీజుకు తీసుకుని వ్యాపారం చేస్తుండగా లీజు గడువు కూడా ముగిసిందని ఇప్పుడు వివాదం న్యాయస్థానానికి చేరిందని సమాచారం. లీజు వ్యవహారం ఇద్దరు వ్యక్తులకు సంబంధించింది కానీ కార్పోరేషన్ అధికారులు వ్యాపారి నుంచి ఎందుకు పన్ను వసూలు చేయడం లేదన్న దానిపై కార్పోరేషన్ కార్యాలయం స్పందించడం లేదు. గతేడాది ఓ వ్యక్తి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరినప్పుడు అనుమతులు లేవని, ఇంటి నెంబర్ లేదని అధికారులే ధృవీకరించారు. దీనితో ఈ దుకాణం విషయం వెలుగు చూసింది. ఇది జరిగి కూడా నెలలు గడిచిపోయింది. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలో ఇటువంటి దుకాణాలు ఎన్ని ఉన్నాయి, కార్పోరేషన్ ఉద్యోగులు అనుమతులు లేని దుకాణాల నుంచి వసూళ్లు ఎంత అన్న దానిపై ఉన్నతాధికారులు విచారణ చేయాలి. కార్పోరేషన్ ఆదాయానికి గండికొడుతున్న సిబ్బందిపై చర్యలు తీసుకుని మొత్తం పన్ను వసూళ్లు చేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఇంటింటికి కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

**జెండా పండుగను విజయవంతం చేయండి**



**ప్రజాపక్షం/వైరా:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆదేశాను సారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లావ్యాప్తంగా జెండా పండుగ కార్యక్రమం ఇంటింటికి జెండా కట్టించే కార్యక్రమంలో భాగంగా వైరా మండలానికి ఇంచార్జిగా నియమింపబడిన గుంటి భవాని ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ ఇంటింటికి జెండా పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలంలోని ముఖ్య నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఇంటింటి జెండా కట్టించే కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ళ గంగారావు, వైరా మున్సిపాల్ మాజీ వైస్ ఛైర్మన్ సూతకాని జైపాల్, దాసరి దానియేలు, వైరా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, వైరా పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మాజీ కౌన్సిలర్ బత్తుల గీత, కట్ల సంతోష్, పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, దార్న రాజశేఖర్, షేక్ అన్వర్‌పాషా, వీరంశెట్టి సీతారాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గరిడేపల్లి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/ బోనకల్ :** జాతీయ కాంగ్రెస్ నాయకురాలు, వాయినాడ్ పార్లమెంట్ సభ్యులు ప్రియాంక గాంధీ జన్మదినం సందర్భంగా ఎన్ఎస్‌యుఐ యూత్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ముష్టికుంట్ల సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నేత పైడిపల్లి కిషోర్‌బాబు మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా సేవా రంగంలో అనేక మందికి సహాయం చేసే వారిగా ఉండాలని, ఆశ్రయ సేవా సొసైటీ ద్వారా ఎన్నో ఏళ్లుగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. రక్తదాన కార్యక్రమంలో 25మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు, రావినూతల గ్రామ సర్పంచ్ భూక్యా భద్రునాయక్, తూటికుంట్ల సర్పంచ్ తుళ్లూరి లక్ష్మీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అనమోలు వెంకటేష్ సత్యనారాయణ, ఎర్రంశెట్టి సుబ్బారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దేగల వేలాద్రి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి చర్యలు

**-ఏకగ్రీవ పంచాయతీలకు రూ. 10 లక్షలు గ్రాంట్**
**-ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు దృష్టి సారించాలి**
**-మంచుకొండ లిఫ్ట్ ప్రారంభానికి రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలి**
**-బిటి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన**





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు రూ. 10 లక్షల గ్రాంట్ అందిస్తామని మంత్రి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని రాములుతండా నుండి చింతగుర్తి కొర్లబోడు తండా క్రాస్ రోడ్డు వరకు రూ. 2.5 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం ప్రారంభానికి రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలన్నారు. మహిళలకు ప్రభుత్వం నాణ్యమైన చీరెలను ఉచితంగా పంపిణీ చేసిందన్నారు. సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్‌సిలెండర్, ఆర్టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతులకు సాగునీటిని అందించేందుకు చేపట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకం పూర్తయిందని ఈ ప్రాజెక్టు క్రింద నీటిని వదిలే కార్యక్రమానికి రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. మూడవ పంటకు సైతం సాగునీటిని అందించనున్నట్లు తెలిపారు. రైతులు లాభసాటి పంటయైన ఆయిల్ పామ్‌ను సాగు చేయాలన్నారు. అంతర పంటల క్రింద కూరగాయలు, పత్తి, అపరాలు సాగు చేసుకోవచ్చునని మంత్రి తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మండలంలో రహదారులను వేయిస్తుందన్నారు. రోడ్ల కనెక్టివిటి పెరగడం వల్ల ప్రజలకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డివో జి. నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, సర్పంచ్ బానోత్ వెంకట్రాం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తలసేమియా రహిత సమాజమే లక్ష్యం

**-ముందస్తు పరీక్షలపై అవగాహన కల్పిస్తాం**
**-సంకల్ప సంస్థ ఆధ్వర్యంలో**
**తలసేమియా చిన్నారులకు వైద్య పరీక్షలు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తలసేమియా వ్యాధి బారినపడుతున్న చిన్నారుల సంఖ్యను తగ్గించి భవిష్యత్తులో తలసేమియా రహిత సమాజం కోసం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కృషి చేస్తుందని ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ రెహానాబేగం తెలిపారు. సోమవారం ఖమ్మం కోణార్క్ హోటల్‌లో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ వైద్యులు చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎంఏ అధ్యక్షురాలు రెహానాబేగం మాట్లాడుతూ తలసేమియాను అరికట్టాలంటే వివాహానికి ముందే అవసరమైన పరీక్షలు చేస్తే ఉత్తమమన్నారు. త్వరలో ఐఎంఏ ఆధ్వర్యంలో గైనకాలజిస్టు, పిల్లల వైద్యులతో కలిపి ఓ సెమినార్ నిర్వహిస్తామన్నారు. ప్రత్యేకంగా తలసేమియాపై అవగాహన కల్పించేలా ఈ సదస్సు ఉంటుందన్నారు. తలసేమియా చిన్నారులకు అవసరమైన సేవలను జిల్లాలో ఐఎంఏ ద్వారా అందిస్తామన్నారు. ఖమ్మం సిటిసి అడిషనల్ డిసిపి విజయ్‌బాబు మాట్లాడుతూ చిన్నారులకు అవసరమైన సేవలను అందించేందుకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. రక్తంతో పాటు ఇతర సేవలను అందిస్తామన్నారు.




### చిన్నారులకు అందుతున్న సేవలు భేష్...

తెలంగాణలో తలసేమియా చిన్నారులకు అందుతున్న సేవలు అద్భుతంగా ఉన్నాయని జాతీయ తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జెఎస్ అరోరా తెలిపారు. గతంతో పోలిస్తే చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయన్నారు. ఖమ్మంలో చిన్నారులను పరీక్షించామని వారికి సంకల్ప స్వచ్ఛంద సంస్థ నుండి అందుతున్న సేవలు బాగున్నాయన్నారు. సమయానికి రక్తం, మందులను అందించడం, వైద్య పరీక్షలు చేయించి చికిత్స చేయించడం వల్ల చిన్నారుల్లో ఎదుగుదల కనిపిస్తుందన్నారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ కోటేశ్వరరావు, వైద్యులు నారాయణమూర్తి, లక్ష్మి దీపా, నరేష్, సంస్థ ఉపాధ్యక్షురాలు పి. పావని, బాధ్యులు పి. రవిచందర్, పి. ఉదయ్‌భాస్కర్, పి. వంశీకిరీటీ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ భారీ బహిరంగ సభను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ బోనకల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఖమ్మం నగరంలో లక్షలమందితో సిపిఐ వందేళ్ల భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు తెలిపారు. 18వ తేదీ ఖమ్మంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ బ్రాహ్మణపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు కొంగర అప్పయ్య స్థూపం వద్ద నుండి మండలంలో ప్రచార జాతా సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యురాలు బత్తినేని నీరజ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అవిర్భవించిందని ఆనాటి నుండి నేటి వరకు ప్రజల హక్కుల కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించిందన్నారు. సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ అన్నారు. నూరు సంవత్సరాల కాలంలో భారతదేశంలో కార్మిక, శ్రామిక, రైతాంగ విద్యార్థి, యువజన సమస్యలపై అలుపెరగని పోరాటం గావించిందన్నారు. జనవరి 18న ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభను పార్టీలకతీతంగా




పాల్గొని జయప్రదం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు పారుపల్లి నర్సింహారావు, మాతంగి శ్రీనివాసరావు, వంగాల నర్సింహా, కాంగ్రెస్ పార్టీ బ్రాహ్మణపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు పెద్దప్రోలు సైదులు, సిపిఎం పార్టీ నాయకులు మందడపు రామారావు, బ్రాహ్మణపల్లి ఉపసర్పంచ్ ఏలూరు రమేష్, సిపిఐ మండల సమితి సభ్యులు మడుపల్లి వెంకటేఏశ్వర్లు పాల్గొన్నారు.

# జమ్మిబండ వద్ద ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 41వ డివిజన్ జమ్మిబండ వద్ద ముగ్గుల పోటీలను నిర్వహించారు. సోమవారం కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, భవాని కూలర్స్ చారి, పాకాలపాటి రాంబాబు, స్థానికుల ఆధ్వర్యంలో జమ్మిబండ ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ పునుకొల్లు నీరజ హాజరై ప్రారంభించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముగ్గుల పోటీలు మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిభింభిస్తాయన్నారు. మహిళల్లో ఉన్న సృజనాత్మకతకు అద్దం పడతాయన్నారు. పోటీల్లో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రంగు రంగుల ముగ్గులను వేశారు. విజేతలకు మొదటి బహుమతి వెండి పట్టీలు, రెండవ బహుమతి రైస్ కుక్కర్, తృతీయ బహుమత చీర అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బిజి క్లైమెంట్, దాదె అమృతమ్మ, ప్రముఖ న్యాయవాది బసవపున్నయ్య, సతీష్, దేవస్థానం ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావు, కోదుమూరు వెంకటేశ్వర్లు, డాక్టర్ రఘు, చిన్ని, నవీన్, ఎండి కరీం, యాసిన్, జమ్మిబండ యూత్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి టిడిపి సిద్ధం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మున్సిపాలిటీలో త్వరలో జరగనున్న ఎన్నికల్లో వార్డుల్లో పోటీ చేయటానికి టిడిపి సిద్ధంగా ఉందని ఖమ్మం పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం తెలిపారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు మల్లాది హన్మంతరావు అధ్యక్షతన జరిగిన అన్ని వార్డుల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర నాయకుల టిడిపి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మున్సిపల్ ఎన్నికల్లో టిడిపి పోటీ చేస్తుందని, నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, టిడిపి పట్ల ప్రజల్లో సానుకూలత బాగా పెరిగిందని, టిడిపి సారథ్యంలో మధిర మున్సిపాల్టీ అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారని, ఎన్నికలు అయ్యేంత వరకు ప్రజల్లో ఉండి ఐక్యంగా పనిచేసి టిడిపి అభ్యర్థులకు మద్దతు ఇచ్చే పార్టీల నుండి మద్దతు తీసుకుని మధిర మున్సిపాల్టీ కైవసం చేసుకునే దిశగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర నాయకులు చేకూరి శేఖర్‌బాబు, ఐటిడిపి మాజీ కార్యదర్శి వేమూరి సునీల్, తెలుగు యువత రాష్ట్ర నాయకులు యలమంచిలి శివ, రూరల్ అధ్యక్షులు మార్నిడి పుల్లారావు, మహిళా నాయకురాలు మేడేపల్లి రాణి, వంకాయలపాటి నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు, చెరుకూరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో చిల్లర దొంగల హల్‌చల్

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో చిల్లర దొంగల వరుస దొంగతనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మధిర పట్టణంలోని ఆజాద్‌రోడ్‌లో నూతనంగా కొనుగోలు చేసిన ఆటోను దొంగలు దొంగలించటంతో పాటు రాయపట్నం సెంటర్‌లోని ఒక కూల్ డ్రింక్ షాపులో రూ.10వేలు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. అదేవిధంగా సిగరెట్ పెట్టెలు, కూల్‌డ్రింక్స్ ఎత్తుకెళ్లారని, అంబేద్కర్ సెంటర్లో గ్యాస్ సిలెండర్లు, పాత ఆంజనేయ స్వామి టెంపుల్ ఏరియాలో ఒక గ్యాస్ సిలెండర్ ఈ విధంగా చిన్నచిన్న దుకాణాల్లో వరుస చోరీలు చేసినట్లు సమాచారం. దీంతో బాధితులు మధిర టౌన్ సిఐ రమేష్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి సిసి కెమెరాల ద్వారా దొంగలను గుర్తించి వెంటనే అదుపులోకి తీసుకుంటామని, ఇది చిల్లర దొంగలు చేసిన పని అని, రాత్రి వేళల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని సిఐ తెలిపారు.

# బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు



**ప్రజాపక్షం/ బోనకల్ :** బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సిఐటియు, రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తాయని తెలంగాణ రైతు సంఘంజిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ తెలిపారు. లేబర్ కోడ్స్ వివి రామ్‌జి చట్టం జాతీయ విత్తన విద్యుత్ సవరణ రద్దు చేయాలని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా మండల పరిధిలోని ముష్టికుంట్ల గ్రామానికి సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం గత 11 సంవత్సరాలుగా ప్రజల హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రాల జాబితాలో ఉన్న హక్కులను కాలరాస్తుందని, అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లను అమలు, విద్యుత్ సాధన చట్టం విత్తన బిల్లు చట్టం వంటి అనే వ్యతిరేక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాలు దేశ ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తాయన్నారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్ చేసే పోరాటాలకు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్య.కా.సం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తుమ్మ విష్ణువర్ధన్, రాష్ట్ర కమిటీ సభ్యులు బంధం వెంకటరాజ్యం, ఎర్ర శ్రీనివాసరావు, పిన్నింటి రమ్య, తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిఐటియు మండల కన్వీనర్ గుగులోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సీతారావమ్మ మృతి సిపిఐకి తీరని లోటు



ప్రజాపక్షం/చింతకాని : రాఘువాపురం గ్రామ సీపీఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ(90) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సీపీఐ జాతీయ సమితి సభ్యులు

**సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం**

భాగం హేమంతరావు రాఘువాపురం చేరుకుని సావిత్రమ్మ మృతదేహంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ సావిత్రమ్మ బతికినంత కాలం నిబద్ధతగల కమ్యునిస్టుగా బ్రతికిందన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షులు దొబ్బల వెంగళరావు, నాయకులు కొల్లి సీతయ్య, సింగారపు సత్య నారాయణ, కొల్లి రవి, కొల్లి గోవిందరావు, పాతూరి వెంకటి, నక్క బోయిన కృష్ణ, కొల్లి బాబు, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు, సీపీఎం నాయకులు రాచబంటి రాము, దొబ్బల బాబు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడకండి అండగా ఉంటాం

**- సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**
**- మిత్రషోరూం కార్మికుల సమ్మెకు సంఘీభావం**





ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : అధైర్యపడవద్దని మీ సమస్య పరిష్కారం అయ్యేవరకు అండగా ఉంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలోని మిత్రకార్‌షోరూమ్ ఎదుట కార్మికులు, ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె ఏడవ రోజుకు చేరింది. దీనికి సిపిఐ జిల్లా సమితి, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతు, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కమ్యూనిస్టు పార్టీ కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలను చేసి సాధించిందన్నారు. కానీ ప్రస్తుత అధికార పాలకులు వీటిని నిర్వీర్యం చేస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని, ధ్వజమెత్తారు. వాస్తవానికి కార్మిక హక్కుల నిబంధనల ప్రకారం షోరూం ఎత్తివేడం కుదరదని, అయినప్పటికీ ఈ విధంగా వ్యహరించడం సరికాదన్నారు. తక్షణమే పెండింగ్ వేతనం, బోనస్, ఇన్సెంటివులు, గ్రాటివిటీ చట్టబద్ధంగా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉద్యోగులందరికీ ఉపాధి కల్పించాలన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

**ఇంచార్జ్ ఏసిపి వసుంధర యాదవ్**



ప్రజాపక్షం/వైరా : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తప్పవని వైరా ఇంచార్జ్ ఏసిపి వసుంధర యాదవ్ అన్నారు. సోమవారం వైరాలోని ఏసిపి కార్యాలయంలో వసుంధర యాదవ్‌ను కలిసిన మీడియావారితో మాట్లాడుతు కోడాపందాలపై సబ్ డివిజన్ లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. పేకాట స్థావరాలపై కూడా నిఘా కొనసాగుతోందని తెలిపారు. ఎవరైనా జూదాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా పోలీసులతో మమేకం కావాలని సమస్యలను పోలీసులు దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తుకు బానిస కావొద్దని హితవు పలికారు. మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. చైనా మాంజా నిషేధించడం జరిగిందని ఎవరైనా అమ్మకాలు చేస్తే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని అన్నారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు నిత్యం పరిరక్షణ కొనసాగుతుందని తెలిపారు. సంక్రాంత్రి నేపధ్యంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వద్ద వెళ్లే వాహనాలపై కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# నేటి యువతకు స్వామి వివేకానంద ఆదర్శం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : నేటి యువతకు స్వామి వివేకానంద జీవితం ఆదర్శమని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పేర్కొన్నారు. మండలంలోని చెరువుమాదారం లో సోమవారం స్వామి వివేకానంద జయంతి ని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటం కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయన దేశభక్తి, సేవా గుణం ను ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ఆయన బోధనలు నేటి యువత లో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు. ప్రచార కార్యదర్శి సూరేపల్లి జ్ఞానరత్నం, మండల నాయకులు గెల్లా చక్రపాణి, సయ్యద్ మోహినుద్దీన్, కొండాహర్షవర్ధన్, గెల్లా నాగసాయి, జెల్లా సురేష్, కొదమగుండ్ల స్వామి దాసు, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్స్ రూల్స్ పాటించడం ద్వారానే ప్రమాదాల నివారణ




ప్రజాపక్షం/మధిర : ప్రతిఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారానే ప్రమాదాలు నివారించవచ్చునని మధిర టౌన్ ఎస్సై కిషోర్ అన్నారు. రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్వి కాంప్లెక్స్ వద్ద మధిర టౌన్ పోలీస్టేషన్ వారి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, ప్రతిఒక్కరూ విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు, మైనర్లకు వాహనాలు వారి తల్లిదండ్రులు ఇవ్వవద్దని తెలిపారు. సంక్రాంతి సెలవుల కారణంగా మైనర్లు ఇష్టానుసారం వాహనాలపై రోడ్లపైకి వస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలను సీజ్ చేసి జరిమానాలు విధించటంతో పాటు కేసులు నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. వాహనదారులు తప్పనసరిగా హెల్మెట్ వాడాలని, ట్రాఫిక్స్ రూల్స్‌ను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్, బ్లూ కోర్టు సిబ్బంది ప్రసాద్, శేఖర్ పాల్గొన్నారు.

# గొల్లగూడెంలో పశువైద్య శిబిరం ప్రారంభం




ప్రజాపక్షం/ తల్లాడ : మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కోడూరు వీరకృష్ణ ఉమాదేవి, ఉపసర్పంచ్ కృష్ణ నాగలక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత కాలం లో పశువుల్లో వస్తున్న వివిధ రకాల వ్యాధు లు ప్రబలకుండా ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామంలో పశుపోషకులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు డాక్టర్ అనాస్ మందాని, జెఓ నాగరాజు, సిహెచ్ఓ చుక్కారావు, సూపర్వైజర్ శివకృష్ణ, గోపాల్ మిత్ర సత్యనారాయణ, రమేష్, వెంకటేశ్వర్లు, వార్డుమెంబర్ దుర్గారావు,ఎమ్మార్పీఎస్‌నాయకులు వీరయ్య పాల్గొన్నారు.

# సాగునీటి కోసం రైతుల నిరసన



ప్రజాపక్షం/ తల్లాడ : తల్లాడ మండలంలోని రేజర్ల, గాంధీనగర్ తండా, వెంకటగిరి, బిల్లు పాడు గ్రామాల్లో చివరి భూమికి సాగు నీరు అందటం లేదని రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చివర భూమికి సాగునీరు అందకపోవటంతో పంటలు ఎండి పోయి తీవ్ర నష్టం వాటిల్లితుందని, తక్షణమే ప్రభుత్వం స్పందించి చివరి భూమి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌పి డిఇఇ శ్రీనివాస్ రెడ్డి, లస్కర్ సైదులు నిరసన ప్రాంతానికి వచ్చి రైతులతో చర్చించి చివరి భూమికి నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళనను విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు మూడు లచ్చిరాం, హన్మమంతరావు, చీరాల రాంబాబు, బానోతు రవి, భాను, భాషా, లక్ష్మ ణ్, నల్లగట్ల నగేష్, యలమర్తి పుల్లయ్య, సాల్మన్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండలంలోని రైతులంతా రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎఓ సీతారామిరెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుబ్లేడు గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్‌ను సర్పంచ్ సంఘబత్తుల స్వాతిసుమన్‌రెడ్డిలతో ఎఓ సీతారామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన స్వాతి సుమన్‌రెడ్డిలను ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలోని ప్రతి రైతు గుర్తింపు కార్డు పొందాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పెట్టుబడి సహాయం సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ఎరువులు, విత్తనాలు అన్ని రైతు గుర్తింపు కార్డు పొందిన వారికే అందించబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్య సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజకుమార్, ఎఇఓ బాలకృష్ణ, గ్రామ పెద్దలు వనవాసం నర్సింహారెడ్డి, మెట్టు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుడే యువతకు ఆదర్శం : ఎస్సై





ప్రజాపక్షం/వైరా: వివేకానందుడే యువతకు ఆదర్శం, యువశక్తిని తట్టి లేపి సమాజాభివృద్ధికి పటిష్ట బాటలు వేసేలా స్ఫూర్తి నింపిన స్వామి వివేకానందుడే యువతకు మార్గదర్శకుడు అని వారి స్ఫూర్తితో బలహీనతలకు దూరంగా ఉండాలని వైరా ఎస్సై పుప్పాల రామారావు కోరారు. వైరా మండలం గొల్లపూడి గ్రామంలో వివేకానంద వికాస వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవంలో గ్రా మసర్పంచ్, మేడూరి రామారావు అధ్యక్షతన జరిగిన యువజనోత్సవంలో ఆయన మాట్లాడుతూ యువత దుర్వ్యసనాలకు దూరంగా మెలగాలని మత్తు పదార్థాలపై సమాజ వ్యతిరేక శక్తులు పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేడూరి రామారావు మాట్లాడుతూ వైరా మండలంలో మరెక్కడా లేనివిధంగా గొల్లపూడి గ్రామంలో గత 20 సంవత్సరాలుగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహిస్తున్న వివేకానంద వికాస వేదిక బాధ్యులు జివి.సూర్యప్రకాశరావు, అనంతు , గూడపాటి శ్రీనివాసరావు, కొర్లగుంట మురళి, తబలా కృష్ణ, రవి గ్రామంలో చదివి ఉద్యోగం, వ్యాపారాల్లో స్థిరపడిన అందరిని అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాళ్ళ బండి కరుణ్మయి 20, గూడపాటి శ్రీనివాసరావు 10 అందజేసిన దుప్పట్లను 30 మంది బీదలకు ఎస్సై , సర్పంచ్, గ్రామ పెద్దల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వైరా మండల కార్యదర్శి యామాల గోపాలరావు, బిజెపి మండల అధ్యక్షులు దోసపాటి కళ్యాణ్, గ్రామ ఉప సర్పంచ్ ఈలప్రలు వెంకటప్పయ్య, షేక్ సైదా, మిట్టపల్లి సతీష్, రాజేష్, ముత్తారపు డేవిడ్, శాఖమూడి లోకేశ్వరరావు, పొన్నం నర్సింహారావు, కొమరనేని శ్రీనివాసరావు, గంగవరపు మోహన్‌రావు, అమరనేని రాఘవయ్య, మిట్టపల్లి రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో స్థిరపడిన గొల్లపూడి వాసి, వ్యాపార దిగ్గజం ఈవూరి వెంకటేశ్వరరావును గ్రామస్థులు ప్రత్యేకంగా సత్కరించారు. గ్రామ పెద్దలకు చిత్రకారులు, ఉపాధ్యాయులు సూర్యం గీసిన వారి చిత్రాలను ఎస్సై బహూకరించారు.

# సృజనాత్మకతకు అద్దం పట్టిన రంగవల్లులు



**- విజేతలకు బహుమతులందజేసిన మంత్రి పొంగులేటి**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోని 32వార్డులకు కలిపి పెద్దతండలోని సాయిప్రభాత్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. మున్సిపాల్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 825మంది మహిళలు హాజరై రంగురంగుల రంగవల్లును గీశారు. కేవలం ముగ్గులు వేయడమే కాకుండా, వాటిలో సామాజిక అంశాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో తమ సృజనాత్మకతను చాటారు. అంతేకాకుండా రైతన్నకు భరోసా, మహిళా రక్షన వంటి అంశాలను ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మాణం సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భార్య మాధురితో కలిసి సతిసమేతంగా హాజరయ్యారు. అలాగే ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి గెలుచుకున్న లక్ష్మి ప్రసన్నకు రూ.30వేలు, ద్వితీయ బహుమంతి గెలుచుకున్న ఎన్ విజయ రూ.25వేలు, తృతీయ బహుమతి గెలుచుకున్న కె.నిర్మలకు రూ.20వేలు నాల్గవబహుమతి గెలుచుకున్న వి.నాగమణికి రూ.15వేలు, ఐదవ బహుమతి గెలుచుకున్న పి. రమాదేవికి రూ.10 వేలు, 6నుంచి10 స్థానాల్లో నిలిచిన వారికి రూ.5వేల చొప్పున అందజేశారు. అంతేకాకుండా 11నుంచి20 స్థానాల వారికి రూ.2వేల చొప్పున, 21నుంచి30 స్థానాల వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పోటీలలో పాల్గొని ముగ్గేసిన 80ఏండ్లు వృద్దురాలికి రూ.2వేలను ప్రత్యేకంగా అందించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్, భూక్య సురేష్‌నాయక్, మండల నాయకులు వెంపటి రవి, కిషోర్, హరి, ప్రసాద్, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా బౌద్ధక్షేత్రం పనులు పూర్తి చేస్తాం




**-ఎక్కడా కూడ ఆనవాళ్ల ను చెడగొట్టే చర్యలు చేపట్టం**
**-పురావస్తు డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బౌద్ధక్షేత్రం లో జరుగుతున్న పనులను అనుకున్న సమయానికి శర వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ పేర్కొన్నారు. స్థానిక బౌద్ధక్షేత్రం వద్ద జరుగుతున్న పనులను సోమవారం పరిశీలించారు. ఇటీవల పనుల వద్ద బయటపడ్డ మట్టి కుండ ను పరిశీలించి వాటిని బయటకు తీసేందుకు సిబ్బంది కి పలు సూచనలు చేశారు. కుండ లో లభించిన మట్టి ప్రతిమ లను ఇతర వస్తువులను శాఖ ఆధ్వర్యంలో భద్రపరచేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చరిత్ర కలిగిన బౌద్ధక్షేత్రం వద్ద లభించే వస్తువులను భద్రపరుస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న పనుల వలన ఎక్కడా కూడఆనవాళ్లు కు నష్టం లేకుండా తగిన జాగ్రత్తలతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. పురాతనంగా ఉన్నట్లుగానే దొరికిన ఆధారాల మేరకు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశాలు నిర్వహించేలా ఉన్న ఆనవాళ్లు...యాగశాలలు అన్ని కూడ అదే రూపంలో నిర్మించనున్నట్లు తెలిపారు. గతంలో పని చేసిన వారి సలహాలు కూడ తీసుకుంటామని పేర్కోన్నారు. ఈపనులను మరో నెల రోజులలో పూర్తి చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మరి కొద్ది రోజులలో మంత్రి శ్రీనివాసరెడ్డి, శాఖ డైరెక్టర్ లు సందర్శించి విధంగా కార్యచరణ ను రూపొందించినట్లు తెలిపారు. వారు పరిశీలన అనంతరం వారి అమోదం మేరకు పనులు వెంటనే పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ లు నర్సింగ్ నాయర్, శంకర్, సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు కల్పించండి

**- ప్రజావాణిలో సర్పంచ్ ఆర్మీ రవి ఫిర్యాదు**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండల తహశీల్దార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సుదీర్ఘ ప్రాంతాల నుంచి వివిధ అవసరాల కోసం తహశీల్దార్ కార్యాలయానికి మహిళలు, వృద్ధులు ఎంతో మంది వస్తున్నారని, వారికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉందని వెంటనే అద్దె భవనం నుండి శాశ్వత భవనం నిర్మాణం చేపట్టాలని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో సర్పంచ్ ఆర్మీ రవి ఫిర్యాదు చేశారు. పాలేరు నియోజకవర్గంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుమలాయపాలెం మండలంలో అద్దె భవనంలో తహశీల్దార్ కార్యాలయం ఉండటం విడ్డూరమని వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన కోరారు. ప్రస్తుతం అద్దె భవనంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేవని, తాగునీరు, టాయిలెట్స్ పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారని, ఎంతో సుదీర్ఘ ప్రాంతం కలిగిన తిరుమలాయపాలెం మండలం 40గ్రామపంచాయతీలతో జిల్లాలోని అతి పెద్ద మండలంగా నిలిచిందని, నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ పెద్దలు అధికారులు వెంటనే స్పందించి పనులు చేపట్టాలని ఆయన కోరారు.

# క్రాంతి కళాశాలలో ఘనంగా స్వామి వివేకానంద జయంతి




**ప్రజాపక్షం/వైరా:** స్థానిక ఎస్ఆర్ ఠాగూర్ విద్యాసంస్థలైన క్రాంతి జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, చైర్మన్ వాసిరెడ్డి సునీత, నరేంద్ర దత్త చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రన్ ఫర్ స్వేదేశీ కార్యక్యరమంలో భాగంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ వివేకానందుని రచనలు రాజయోగ, కర్మయోగ, జ్ఞాన యోగ, మొదలైన రచనల ద్వారా యువతను ఉత్తేజపరిచిన ఘనత స్వామి వివేకానందునిది అని అందుకే ఆయన జన్మదినాన్ని యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని, ఆయన జీవిత విశేషాలను స్ఫూర్తిగా తీసుకొని వ్యక్తిగత విజయవంతంతో పాటుగా పరోక్షంగా దేశ సేవలో నిమగ్నమవ్వాలని ఆ రకంగా యువత పటిష్టమైనటువంటి భవిష్యత్తును నిర్ణయించుకోవడం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. యువజన దినోత్సవం సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు వివిధ విభాగాల్లో క్రీడలు నిర్వహించారు. మంచి ప్రావీణ్యత, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన బహుమతి ప్రధానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లింగారావు, ప్రిన్సిపాల్ కృష్ణారావు, మజీద్, వేణు, అధ్యాపకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

# సిపిఎం నుండి సిపిఐలో చేరికలు



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** సిపిఎం పార్టీ నుండి పలువురు సిపిఐ పార్టీలో చేరారు. సోమవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో పలువురు సిపిఐలో చేరారు. మండల పరిధిలోని పుఠాని తండాకు చెందిన బానోత్ నాగేశ్వర రావు, కోయచలకకు చెందిన టి. మధు, జంగాల మధు, చందు, మల్లప్ప, మహేష్, కామేపల్లి మండలం అడవిమద్దులపల్లికి చెందిన సత్తి రాములు సిపిఎం పార్టీని విడి సిపిఐలోకి చేరారు. వారికి కూనంనేని సాంబశివరావు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సం దర్భంగా కూనంనేని మాట్లాడుతూ పార్టీ విస్తరణకు కృషి చేయాలని తెలిపారు. ప్రతి గ్రామాన సిపిఐ జెండా ఎగురవేసి రజబ్‌అలీ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు భారీ జన సమీకరణ చేసి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, జిల్లా నాయకులు చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అభీష్టం మేరకే అభివృద్ధి పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజల అభీష్టం మేరకే బూర్గంపాడు గ్రామ పంచాయితీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు బూర్గంపాడు గ్రామ పంచాయితీ సర్పంచ్ మందా నాగరాజు అన్నారు. సోమవారం పంచాయితీ పరిధిలోని రామాలయం పరిధిలోని వార్డులో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీని అనంధ్న రంగాల్లో అభివృద్ధి చేసేందుక ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతామని తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించబడినప్పుడే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. తద్వారా గ్రామ పంచాయితీ అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశవారీగా నెరవేరుస్తామని తెలిపారు. పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఈ పంచాయితీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జములారెడ్డి, గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, పాలక మండల సభ్యులు రామకృష్ణ, కేసుపాక ప్రవళిక, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ నియోజకవర్గ అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు భజన ప్రసాద్ కుమార్, గుద్దేటి ప్రవీణ్ కుమార్, నాయకులు పాషా, పుట్టి లక్ష్మీ నారాయణ, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల ఇళ్లలో వెలుగులు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పేదల ఇళ్లలో వెలుగులు నింపేందుకు తెలంగాణ ప్రభు త్వం గృహా జ్యోతి పథకం ను ప్రవేశపెట్టినట్లు నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండలం లోని కొత్త కొత్తూరు లో వల్లాల కవిత అనే లబ్దిదారులకు ఉచిత విద్యుత్ మంజూరు పత్రం ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్దిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు ఉచిత విద్యుత్ ను అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వం కు ఉన్న దృడమైన నిబద్ధత కు స్పూష్టమైన నిదర్శమని అన్నారు. వ్యవసాయ రంగం ను మరింత బలోపేతం చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటా వెలుగులు నింపాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఉచిత విద్యుత్ ను అందిస్తున్నట్లుఅందిస్తున్నట్లు తెలిపారు.మంత్రి శ్రీనివాస్ రెడ్డి చోరవ తో పాలేరు లో అభివృద్ధి తో పాటు పలు సంక్షేమ పథకాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాళోత్ కళావతి, ఉప సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, విద్యుత్ ఏఈ రవి, పంచాయతీ కార్యదర్శి రవి, పైనంపల్లి సోసైటీ మాజీ చైర్మన్ నల్లాని మల్లిఖార్జునావు, సిబ్బంది రమేష్, సతీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేరీమాత వార్షికోత్సవం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు నందు మేరీమాత వార్షికోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ మేరీమాత ఆశీస్సులతో వైరా మున్సిపాలిటీ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాం క్షించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మండల కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, కాంగ్రేస్ పార్టీ నాయకులు కట్ల సంతో ష్, నారపునేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌రెడ్డి, దార్న రాజశేఖర్, ఫణితి శ్రీను పాల్గొన్నారు.

# పుర పోరు ఓటర్ల జాబితా విడుదల

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు పురపాలక ఎన్నికలు సందర్భంగా మున్సిపాలిటీ కమిషనర్ ఎం. రామచంద్రరావు సోమవారం ముసాయిదా ఓటర్ల తుది జాబితా అధికారికంగా విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓటర్ల సంఖ్య 18, 866 గా నమోదు కాగా ఓటర్ల వివరాలను వెల్లడించారు. ఓటర్ల జాబితాలో వచ్చినటువంటి అభ్యంతరాలను పరిశీలించి ఈ ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 20వార్డులకు 40 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఓటర్ల వివరములు మొత్తం 18,866 ఓటర్లలో మహిళా ఓటర్లు 9785 మంది ఉండగా ,పురుష ఓటర్లు 9081 ఉన్నారు. ఈ ముసాయిదా ప్రకటనలో మేనేజర్ నాగేశ్వరరావు, వార్డు అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఖమ్మం సారధినగర్‌కు చెందిన ఎస్కె అతిర్ 48వ డివిజన్ పరిధిలో తమ ఇంటి పక్కన అనాధికారికంగా కారం పిండిమిల్లు నడుపుతున్నారని దీని వల్ల తమ కుటుంబ సభ్యులకు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని మిల్లును మార్చాలని దరఖాస్తు చేశారు. వైరా శాంతినగర్‌కు చెందిన కె. వెంకటేశ్వర్లు తనకు 69 వయస్సు ఉందని వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. సత్తుపల్లి మండలం రుద్రక్షపల్లికి చెందిన కె. రమేష్ సిద్దారం గ్రామానికి సంబంధించి రేషన్ షాపు డీలర్ పోస్టు ఖాళీగా ఉందని తనకు అర్హత ఉన్నందున ఆ పోస్టును మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేశారు. మధిర మండలం చిలుకూరు గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపును రద్దు చేయాలని కోరుతూ స్థానికులు దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించిన అదనపు కలెక్టర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌వో ఎ. పద్మశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# భట్టి గ్యారంటీ కార్డులు.. బాకీ కార్డులయ్యాయి

**- భట్టికి పట్టిన మధిర మున్సిపాల్టీ ఎన్నికల భయం**
**- మాజీ ఎంపి నామా**




**ప్రజాపక్షం/మధిర :** ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క గ్యారంటీ కార్డులను భద్రంగా దాచుకోవాలని చెప్పారని, కాని నేడు అవే గ్యారంటీలు హామీలుగా మారి చివరకు బాకీ కార్డులుగా మిగిలి పోయాయని ఖమ్మం మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు విమర్శించారు. మధిర మున్సిపాలిటీపై గులాబీ జెండా ఎగురవేయాలని దానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించి పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో బాకీ కార్డులను చేతబట్టి ప్రతి ఇంటికి వెళ్లి, భట్టి బాకీ పడ్డ హామీలు నెరవేర్చిన తర్వాతనే మధిర పట్టణంలో ఓటు అడగాలని కోరారు. మధిర మున్సిపాల్టీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీకి మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందని వారు అన్నారు. నేడు ఎన్నికలు వస్తున్నాయని 15 కోట్లు మంజూరు చేస్తూ జీవోలు ఇచ్చి ప్రజలను మభ్య పెడుతూ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. రెండేళ్లుగా బిఆర్‌ఎస్ పార్టీ హయాంలో నిర్మించిన ప్రభుత్వ హాస్పటల్‌ను ప్రారంభించకుండా నేడు ఎన్నికలు వస్తున్నాయని ప్రారంభిస్తున్నారని అన్నారు. భట్టికి మధిర మున్సిపల్ ఎన్నికల భయం పట్టుకుందని వారు ఎద్దేవా చేశారు. రూ.100కోట్లతో కేసిఆర్ నాయకత్వంలో మధిర పట్టణాన్ని అభివృద్ధి చేస్తే నేడు రూ.128 కోట్లతో మధిర పట్టణాన్ని విధ్వంసం చేశారని అన్నారు. త్వరలో జరుగనున్న మధిర మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ గెలుపుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పల్లపోతు వెంకటేశ్వరరావు, అరిగే శ్రీనివాసరావు మాజీ మున్సిపల్ చైరపర్సన్ మొండితోక లత జయాకర్, నాయకులు రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, బిక్కి కృష్ణప్రసాద్, వంకాలయపాటి నాగేశ్వరరావు, చావా వేణు, వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఐలూరు ఉమామహేశ్వరరెడ్డి, జగన్మోహన్ రావు, వైవి.అప్పారరావు, మాధవి, కోన నరేందర్‌రెడ్డి, అబ్బూరి రామన్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో రాణించాలి

**-విద్యార్థులను అభినందించిన డిఈవో చైతన్యజైని**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించి ఖమ్మం జిల్లా పేరును ఇనుమడింపజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని తెలిపారు. ఈ నెల ఆరు నుండి తొమ్మిది వరకు కామారెడ్డి జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఖమ్మం జిల్లా తరుపున పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో డిఈవో చైతన్య జైని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డిఈవో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించిన ఎగ్జిబిట్‌ను మరి కొంత ఆధునీకరించి జాతీయ స్థాయిలో పాల్గొనాలన్నారు. దీనికి అవసరమైన మార్పులు సూచించామని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. సుస్థిర వ్యవసాయం అనే ఇతివృత్తంలో జూనియర్ విభాగంలో పంట అవశేషాలను తగలబెట్టకుండా ఉపయోగపడే బాయిలో బయో అరోమాటిక్స్‌గా మార్చే ప్రదర్శన చేసి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందిన త్రివేణి టాలెంట్ స్కూల్‌కు హరిచరణ్‌ను, ఆరోగ్యం, పరిశుభ్రత అనే ఇతివృత్తంలో స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టం అనే అంశాన్ని ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో విజేతగా నిలిచి జనవరి 19 నుంచి జరగబోయే దక్షిణ భారత సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపికైన న్యూఇరా పాఠశాలకు చెందిన శ్రేష్టశ్రీ, వారి గైడ్ టీచర్లను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన చిన్నారులను డిఈవో తో పాటు ఎంఎవో పెసర ప్రభాకర్‌రెడ్డి, ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, గైడ్ టీచర్లు అభినందించారు.ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్లు రాధాకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సంక్రాంతి ఘుమఘుమలు



**ప్రజాపక్షం/కల్లూరుః** గ్రామాల్లో సంక్రాంతి పర్వదిన సందర్భంగా పిండివంటలతో గృహాలు ఘుమఘుమ లాడుతున్నాయి .మండల పరిధిలోని సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబాలలో పిండి వంటలతో ఘుమఘుమలు తో ఉన్నాయి ఒకే కుటుంబానికి చెందిన కొందరు కలిసి గృహాలలో పిండివంటలు చేసుకుంటున్నారు. పట్నం నుంచి పల్లెకు వచ్చిన ఉద్యోగులు, విద్యార్థులు తో కలిసి గృహాలు కళకళలాడుతున్నాయి మండల పరిధిలోని లింగాల, చెన్నూరు ,పెద్ద కోరుకొండి ,చిన్న కోరుకొండి, ముచ్చవరం, బత్తులపల్లి, పేరు వంచ ,మర్లపాడు, తెలగవరం ,వెన్నవల్లి , చంద్రు పట్ల ,రఘునాథ గూడెం ,తదితర గ్రామాలలో బంధుమిత్రులతో గృహాలలో కళకళలాడుతున్నాయి మరికొన్ని గృహాలలో మూడు తరాల వారు కలుసుకున్నారు .గత కొన్ని సంవత్సరాలుగా ఉన్న గత స్మృతులను గుర్తుకు తెచ్చుకుంటున్నారు ఈ సందర్భంగా పిండివంటలైన అరిసెలు, కారప్పూస ,చెక్కలు, కజ్జికాయలు ,ఇష్టమైన వంటలను చేసుకొని ఆరగిస్తున్నారు. ఈ పర్వదినం సందర్భంగా పలు రకాల పంటలు ఒకేసారి ఇంటికి రావడం బంధుమిత్రులు కుటుంబాలలో కలుసుకోవడం తో ప్రత్యేక పూజలకు సిద్ధమయ్యారు.

# వినియోగదారులకు డిప్యూటీ సిఎం లేఖలు

**-ప్రభుత్వం ప్రజల మధ్య వారధిగా వినూత్న కార్యక్రమం**
**- విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రభుత్వం ప్రజల మధ్య వారిధిగా వినూత్న కార్యక్రమం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశాల మేరకు చేపట్టినట్లు జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాసాచారి తెలిపారు. అందులో భాగంగా గృహ జ్యోతి పథకం లబ్దిదారులకు, వ్యవసాయ ఉచిత లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షల లేఖను అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో గృహజ్యోతి, వ్యవసాయ లబ్దిదారులకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శుభాకాంక్షల లేఖలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారి శ్రీనివాసాచారి మాట్లాడుతూ వినియోగదారుల ఇండ్లకు విద్యుత్ శాఖాధికారులు క్షేత్రస్థాయిలో వెళ్లి స్వయంగా ఈ శుభాకాంక్షల లేఖలను అందజేస్తున్నారని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా వినియోగదారులు, విద్యుత్ శాఖాధికారుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడతాయన్నారు. భవిష్యత్తులో పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. జిల్లా వ్యాప్తంగా గృహజ్యోతి పథకానికి సంబంధించి 2,46,885 మంది వినియోగదారులు, వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకం క్రింద 1,18,231 మంది వినియోగదారులకు ఈ లేఖలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విద్యుత్ శాఖాధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని షీటీమ్స్ ఎస్ఐ షాహినా తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని సోమవారం ఖమ్మం జిల్లా గ్రంథాలయంలో మేరా యువ భారత్ ఖమ్మం జిల్లా, ప్రజ్వల యువజన సంఘం ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం షీ టీమ్స్ ఎస్ఐ షాహినా పాల్గొని వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం సంపాదించాలంటే కొన్ని సూత్రాలు ఉండాలన్నారు. ఉద్యోగం రాకపోతే ప్రతి వ్యక్తికి ఏదో ఒక ప్రత్యేకమైన కళ ఉంటుందని దానిని వెలికితీసి దానిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఫోక్సో వంటి కఠినమైన చట్టాల గురించి యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాసరచనలో మొదటి బహుమతి జి. దామ్లానాయక్, రెండవ బహుమతి పగడాల వెంకటేష్, మూడవ బహుమతి ఆర్‌పి కుంజన్ సాధించారు. వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేరా భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. భానుచందర్, ప్రజ్వల యువజన సంఘం అధ్యక్షులు చింతమాల పాపయ్య, జిల్లా యువజన సంఘాల సమితి అధ్యక్షులు కోడిరెక్క ఉమాశంకర్, జాయింట్ సెక్రటరీ గోగుల చంద్రశేఖర్, లైబ్రరీ అధికారి బాబు, వాలంటీర్స్ నరేందర్, మోహన్‌లాల్, రవీందర్, యువతీ, యువకులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా డైరీలో ప్రతి మహిళ సభ్యత్వం కల్గిఉండాలి



**ప్రజాపక్షం/చింతకాని :** ఇందిరా మహిళా డైరీలో సంఘంలో ఉన్న ప్రతి మహిళా సభ్యత్వం కలిగి ఉండాలని డిఆర్‌డీవో సన్యాసయ్య పేర్కొన్నారు. సోమవారం చింతకాని రైతు వేదిక నందు చింతకాని, బోనకల్ మండల మహిళా సమాఖ్య ఓబి సభ్యులకు, ఇందిరా డెయిరీ కమిటీ సభ్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సన్యాసయ్య మాట్లాడుతూ డెయిరీ కోసం క్యాటిల్ షెడ్ నిర్మాణం వేగవంతం చేయాలని, షెడ్ల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. షెడ్ల నిర్మాణం కోసం అవసరమైతే గ్రామసమాఖ్యల ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. స్త్రీ నిధి బకాయిలను రికవరీ చేయాలని ఈ నెల చివరి వరకు 80శాతం వసూలు చేయాలని దీనికి అవసరమైన కార్యాచరణ స్దిం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ సమావేశంలో ఏపిఓ డెయిరీ నరసింహులు, స్త్రీనిధి రిజనల్ మేనేజర్ రవీందర్ నాయక్, డిపిఎం ఆంజనేయులు, చింతకాని , బోనకల్ ఏపీఎంలు నాగపుల్లారావు, కొట్టె వెంకటేశ్వర్లు, ఏపీఓ కోటయ్య, వెటర్నరీ డాక్టర్ శ్రీహరీ, ఐకేపీ సీసీలు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పండుగ సందర్భంగా మార్కెట్ కమిటీ ఆవరణలో సోమవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలైన వారికి స్థానిక ఎమ్మెల్యే మట్టారాగమయి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు మహిళలకు ఈ పండుగ ఎంతో ప్రాముఖ్యంగా ఉంటుందని ఈ పండుగను ప్రజలు ఉల్లాసంగా ఉత్సాహంగా కుటుంబాల పరంగా ఐక్యంగా జరుపుకోవాలని కోరుతూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భోగి మంటలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజాదేవి ,సిడిపిఓ నిర్మల జ్యోతి చంద్రశేఖర్ తహసిల్దార్ పులి సాంబశివుడు, కమిషనర్ రామ్ చంద్రరావు, మేనేజర్ నాగేశ్వరరావు, ఐ కే పి ఎ పి యం అశోక రాణి, నాయకులు పసుమర్తి చంద్రరావు, మెప్మా రిసోర్స్ పర్సన్ లు, ఐకెపి సిబ్బం,ది యూత్ కాంగ్రెస్ నాయకులు ఆలకుంట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

